

ఒకనాటి సాయంకాలం నేను వీధి గుమ్మంలో కూర్చుని ఉండగా వచ్చాడు ఆయన. సన్నగా, నల్లగా పొడుగ్గా ఉన్నాడు. చిన్న గడ్డం; చింకి గుడ్డలు. పొడవైన వెంట్రుకలు తలమీద చిందర వందరగా వేలాడుతున్నాయి. చేతిలో ఒక మాసిన బట్టల మూట,కాగితాల కవిలెకట్ట. వయస్సు ముప్పై ఏళ్లకు మించి ఉండదు.

"అయ్యా, అన్నం పెట్టించండి. లేదా పది పైసలు అయినా ఇప్పించండి" అన్నాడు.

"పది పైసలు ఎందుకు?" అని అడిగాను.

"పదిపైసలు లేనిదే టీ నీళ్లయినా దొరకవు కదండీ—ఏమి లాభంలెండి? ఆకలి తీరుతుంది కనుకనా? పది నిమిషాల తరువాత మళ్లీ కడుపు ఖాళీ. అన్నమే పెట్టించండి" అన్నాడు.

నేను మా ఆవిడ్ని కేకేస్తాను.

"అయ్యా, మీకు ధర్మం ఉంటుంది గాని ఆడవాళ్లకి ఈ పని అప్పగించకండి" అన్నాడు ఆయన.

"ఏమిటి సంగతి? ఆడవాళ్లే కదా మనకు అన్నంపెట్టేది?" అన్నాను నేను.

"ఆమాట నిజమే కానీయండి. వాళ్లలో తనవాళ్లు పైవాళ్లు అనే భేదభావం ఉంది. పైవాళ్లు అనగానే వాళ్ల బుద్ధి పెడత్రోవ తొక్కుతుంది. ధర్మంగా అనగానే వారి బుద్ధి మరీ సంకుచితమై పోతుంది. చారు అన్నం ఆవకాయ కొంత పారేస్తారు. ఆవకాయ రుచిగానే ఉంటుంది గానీండి—వెధవది ఆకలి కడుపుమంట పట్టుకొని గంటన్నరదాకా వదలదు. అన్నం పెట్టించాలని ఉంటే అన్నిటితో పాటు పెట్టించండి. కడుపునిండా ఆరగించవచ్చు" అన్నాడు ఆయన.

గుమ్మంలో నిలబడి అతనిమాటలు వింటూంది ఆవిడ. ఏమంటుందో అని అటువైపు చూశాను.

"అలాగే కానివ్వండి. అరగంట పోయాక రమ్మనండి. ఆయన కోరినట్టు కడుపునిండిన భోజనమే పెడదాం" అన్నది ఆవిడ.

ఆయన అల్లాగే తిరిగివస్తానని వెళ్లిపోయాడు. పప్పు, పచ్చడి, కూర, చారు, మజ్జిగ అన్నీ అమర్చి అన్నంపెట్టింది. దగ్గరగా కూర్చుని నేను ఆయనకు ఏమికావాలో చూస్తున్నాను. భోజనం చేస్తున్నంతసేపూ ఆయన ఏదో మాట్లాడుతూనే ఉన్నాడు. నేను కూడా ఆయనను కుశల ప్రశ్నలువేశాను. తనను గురించి అడిగిన ప్రశ్నలను ఆయన వినిపించుకోలేదు. భోజనం పూర్తి అయింది.

"నిజమైన భోజనం పెట్టించారు. ఎంతో ఆత్మీయత కనబరిచారు. కావలసినది ఆత్మకాని

# సంచార వేదాంతి

ఆహారంకాదు. మీరింత అపేక్ష చూపకపోతే నేను అన్నం తినగలిగేవాణ్ణేకాదు'' అన్నాడు ఆయన, చేతులు తుడుచుకుంటూ.

మాటలనుబట్టి చూస్తే మామూలు మనిషి లాగ కనబడలేదు. మేధావిలాగే ఉన్నాడు. మతి గాని చెడలేదుకదా? అనుమానం వేసింది. స్వవిషయం ఏదీ చెప్పడానికి అతను ఇష్టపడడం లేదు అని తెలుస్తూనే ఉంది. నాకుండే రాజకీయ జ్ఞానం వెలిబుచ్చుదామనుకున్నాను.

''రెండవ ప్రపంచయుద్ధంతో బ్రిటన్ రాజకీయంగా వెనుకబడ్డదికదండీ?'' అన్నాను.

''బ్రిటన్ ఎప్పుడూ రాజకీయాలలో ప్రవేశించలేదు. ఇంగ్లీషువాళ్లు అప్పుడూ, ఇప్పుడూ, ఎప్పుడూ వ్యాపారస్తులే. చేపలుపట్టే మనుషులమీద పడవలు వేసుకొని ప్రపంచం అంతా పర్యటన చేస్తుంటారు. వ్యాపారం చేసుకొని వస్తారు. అప్పటికన్న ఇప్పుడే వాళ్ల వ్యాపారం మరింత బాగుపడింది'' అన్నాడు ఆయన. నా తెలివి తక్కువతనం నాకు బోధపడింది.

''సర్వేపల్లి రాధాకృష్ణవంటి వేదాంతి మన దేశానికి అధ్యక్షుడు కావడం మన అదృష్టం కదా?'' అన్నాను.

''అదే దురదృష్టం అతనిపాలిట. వేదాంతి అయినవాడు జీవితంలో సత్యాన్ని గుర్తించాలి. ఆ తెలిసిన సత్యాన్ని నిరూపించాలి. అదే రాజకీయాలలో అయితే తలక్రిందులు అవుతుంది. అక్కడ అసత్యాలను కూడ సత్యాలుగా నిరూపించవలసి వస్తుంది. ఆ పనికి ఒక వేదాంతిని ఉపయోగించడంకన్న పెద్ద అన్యాయం ఇంకొకటి లేదు'' అన్నాడు ఆయన.

ఈయన మళ్ళీ నన్ను బోల్తా కొట్టించాడు. ఈసారి ఓడిపోకూడదు. అత్యంత ఆధునికం అయిన రోదసియానం గురించి అడిగాను.

''రష్యావాళ్లు, అమెరికావాళ్లు ఆకాశంలోకి ఎగిరేందుకు ఒకరితో ఒకరు పోటీలు పడుతున్నారు కానీ ఆధ్యాత్మికంగా ఎంతో శక్తిమంతులం అనుకునే భారతీయులకు ఇది సాధ్యం కావడంలేదుగదా? మరి, ఈ ఆధ్యాత్మిక వాదానికి అర్థం ఏముంది?'' అన్నాను.

''మనం ఆధ్యాత్మిక వాదులమే కాని లౌకిక వాదులంకాము. మన లక్ష్యం ఎప్పుడూ హిమాలయాలని దాటిపోలేదు. అదీగాక వారు ఉండేది భూమికి ఉపరిభాగంలో. అందువల్ల ఆకాశపథగమనం వారికి ఆదర్శమైంది. మన ఔన్నత్యానికి హిమాలయమే లక్ష్యం మరి'' అన్నాడు ఆయన.

ఈవాదం కాదనడానికి నాకు సాహసం చాల లేదు.

మాట్లాడుకుంటూ వీథిలోకి వచ్చాము. ఆయనింక వెళ్ళిపోవడానికి ఉపక్రమించాడు.

''నన్ను మనిష్యివాడని నిరాదరణ చూపక తోటి మానవునివలె దయ చూపినందుకు మీకు ధన్యవాదాలు'' అన్నాడు ఆయన.

''ఏ రూపంలో ఉన్నా మానవుణ్ణి గుర్తించగలిగే శక్తి నాకు భగవంతుడు ప్రసాదించాడు. అదీగాక మేము గృహస్థులం. అతిథి సత్కారం మాకు ధర్మం. అప్పుడప్పుడు దయచేస్తూ ఉండండి'' అన్నాను నేను, అతనితో విజ్ఞాన చర్చకు అవకాశం దొరుకుతుందనే ఆశతో.

''అలాగే వస్తాను'' అంటూ ఆయన అంధకారంలో కలిసిపోయాడు.

అంతవరకు ఆయనతోటి సంభాషణ ఆలకిస్తున్న మా ఆవిడ అన్నది—''ఆయనకు చూడగా ఆడవాళ్లమీద కోపం ఉన్నట్టు కనిపిస్తున్నది. ఏ ఆడదయినా ఇతగాణ్ణి మోసగించిందో, లేదా కట్టుకున్న ఆడదాన్ని ఇతడే అన్యాయంచేసి ఇలా తిరుగుతున్నాడో అనుమానంగా ఉంది. ఈసారి వస్తే ఆరాతీయాలి'' అని.

అది తెలుసుకోదగ్గ అంశమని అనిపించలేదు నాకు.


ఉదయం బజారులో ఆయన్ను చూశాను. ఆయన నన్ను గుర్తించినట్టే కనిపించలేదు. ఇద్దరు ముగ్గురు స్నేహితుల్ని అడిగి చూశాను



## ఉచితం

మిక్కిలి అందమైన రంగులలో, ఆశ్చర్యకరమైన తక్కువ ధరలలో చేనేత చీరెలు. 1 చీరె రు. 9-85. 2 చీరెలు రు. 18-, 3 చీరెలు రు. 25/- పోస్టేజి, ప్యాకింగు ఉచితం. 2 చీరెలతో ఒక అందమైన చెవితమ్మల జత ఉచితం. 3 చీరెలతో ఒక బ్లౌజుకు గుడ్డ ఉచితం. స్టాకులు కొద్దిగా ఉన్నవి. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.



THE ROYAL STORES (APRW),
Post Box No. 1774, Delhi-6.






ఉన్నవాడికి సమస్య లేదని, లేనివాడికి అన్నీ సమస్యలేనని లోకంలో అనుకొంటారు. తద్విరుద్ధమైనది నిజానికి సన్నిహితంగా ఉంటుందేమో? ఏమైనా ఉన్నవాడికి అర్థం కానిదిమాత్రం లేనివాడి సమస్య. లేనివాడి సమస్య ఒక్కటే—బ్రతకడం. లేనివాడికి బిచ్చమెత్తటం జన్మహక్కంటే ఎవరు ఒప్పుకొంటారు?

---

ఆయన సంగతి. "ఏముంది? ఎవడో ముష్టివాడు. పైగా పొగరుబోతు. పైసా, రెండు పైసలూ పనికిరావట, పదిపైసాలు కావాలట. బియ్యంవేస్తే పుచ్చుకోడట. అన్నం పెట్టాలిట. అదయినా అన్నీ అమర్చాలట. ఇక మాటలా? కోటలు దాటుతుంటాయి—తనకన్న మించినవాడు లేడన్నట్టు!" ఇదీవరస. నేను ఆయన సంగతి ఎవ్వరితోనూ చెప్పలేదు. అవును, అందరిలాగ అతడూ ఒక ముష్టివాడు. ఆ ప్రవర్తన లోకం సహించదు.

ఒక ఆదివారంనాడు అనుకోకుండానే ఆయన మా యింటికి వచ్చాడు. ఈసారి ఇద్దరం సహపంక్తిని భోజనం చేశాము. ఆయన సంభాషణనిరంతరాయంగా సాగుతూంది. ఏ భాషలోనయినా, ఏ విషయమైనా ఆయన అనర్గళంగా మాట్లాడుతున్నాడు. పౌరాణిక విషయాల ప్రసక్తి వచ్చింది. మన దేవతల సంగతి చెప్తూ ఆయన ఇలా అన్నాడు:

"మనదేశంలో పైభాగంనుండి వచ్చేవారు—టిబెట్టువాళ్ళు, చైనావాళ్ళు మనకన్న తెల్లనివారు. వాళ్ళు హిమాలయాలలో సంచరించడం జరిగేది. మొదట్లో ఒకరు ఒకరుగా ఉంటూ తమ జాతుల్ని పెంపొందించుకొంటూ వచ్చారు. తరువాత నాలుగైదు జాతులు కలిసి వర్గాలుగా ఏర్పడడం జరిగింది. మనకు త్రింశత్కోటి దేవతలు అని పేరుండడానికి కారణం వారు జనసంఖ్యను మితిమీరకుండా చూసేవారని చెప్పవచ్చు. అందువల్ల రాజ్యాంగంలో ఒడుదుడుకులు లేకుండా కాపాడుకోవడం జరిగింది. పరిపాలనా విధానం జనసంఖ్య పెరుగుదలతో పరివర్తన చెందుతూ వచ్చింది. ఒక్కరొక్కరుగా నియంతృత్వం చేసే అధికారులు అంతరించగా మనకు చిన్న చిన్న రాజ్యాలు, పాలకులు మిగలడం జరిగింది.

"పూర్వపు చక్రవర్తులు కడు సమర్థులు. వారికి దేశాన్ని అత్యల్పకాలంలో చుట్టి రాగలిగే మార్గాలు తెలిసేవి. దానికి తగిన సాధనాలు సంపాదించేవారు. ప్రపంచం నలుమూలల వ్యవహారాలూ పరిశీలించేవారు. పాలకులకు ఇది అత్యవసరం. అట్లా సంచరించేవాడు గనుకనే కృష్ణుణ్ణి రుక్మిణి చిన్ననాడే తెలుసుకోగలిగింది. ప్రాంతీయ ప్రజలు అతణ్ణి గూర్చి చెప్పుకునే వింతకథలు విని రుక్మిణి అతణ్ణి వరించింది."

భగవంతుడు అంటే ఆయన చెప్పే నిర్వచనం మరీ చిత్రం. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ముగ్గురూ వారి వారి కుటుంబాలతో దిగివస్తేనే దేవుడు అవుతాడు అన్నా డాయన. అతని విజ్ఞానం నన్ను విస్మయుణ్ణి చేసింది. పంచభక్ష్యపరమాన్నాలతో ఆయన్ను ఆనందపరచవలెననిపించింది.

మానాన్నగారి ఆబ్దికం ఆరోజు. ఉదయమే కనిపించాడు ఆయన. ఆహ్వానించాను ఆయన్ను భోక్తగా. అతడు—"ఎవరైనా బ్రాహ్మణుని పిలిచి యథావిధిగా ఆబ్దికం జరిపించండి. నేను ఆవేళకువచ్చి, ఇంత తినిపోతాను" అన్నాడు. ఎంతో బోధపరిచి చెప్పినా వేళకు పురోహితుడు రాలేదు. పంద్రెండు దాటింది. పిల్లలు పసివాళ్ళు. ఆకలికి ఆగలేక అల్లరి ఆరంభించారు. శ్రద్ధ చెడుతుందని భయంవేసింది. వేదాంతి మట్టుకు వేళకు వచ్చేశాడు. ఆయన్నే స్నానంచేసి మడికట్టుకోవలసిందిగా కోరాను. నాటికి ఉభయ భోక్తలు ఆయనగానే పరిగణించి ఆబ్దికం ముగింపదలచాను. ఆయనతోపాటు పిల్లలకు కూడా అన్నం పెట్టించాను. ఆయన ఆనందించాడు. భోజనాలు అవుతుండగా పురోహితుడు వచ్చాడు. ఆయనకోసం వేసివుంచిన విస్తరి చూపించాను. బ్రాహ్మడు చిన్నబోయాడు. భోజనానంతరం వేదాంతి అన్నాడు—"బ్రాహ్మణుడు కాదు, బ్రహ్మ కూడా భయపడదగ్గ పనిచేశారు. ఇందులో దోషమేమీలేదు" అని.

ఒకనాడు ఆయన కాలికి పెద్దగుడ్డ కట్టుకొని బాధపడుతున్న ముఖంతో కనిపించాడు గుమ్మంలో. కారణం అడిగాను. "చెరువులో స్నానం చెయ్యబోతే రాయితగిలి వేలు చిరింది. వాచి బాధపెడుతూంటే ఏ పనీ తోచడంలేదు. బాధానివారణకు మార్గం వెతుకుతూంటే మీరు జ్ఞాపకానికి వచ్చారు" అన్నాడు ఆయన.

అన్నం పెట్టించి దగ్గర కూచున్నాను.

"గృహస్థులు—మీకు అపాయం తక్కువ. సదుపాయాలు, సమయానుకూలపోషణ, సంరక్షణ మీకు ఉన్నాయి. అందుచేతనే మీరు మావంటి నిరాశ్రయుల్ని, నిరాధారుల్ని ఆదరించాలి. యాచకుణ్ణి అని త్రోసిపారవేయకూడదు. యాచన కూడా జన్మహక్కే.

"ఈ శరీరంమీది వ్యామోహం మహాచెడ్డది. ఒకవక్క చావురోగాలతో కుళ్ళిపోతున్నప్పటికీ మిగిలిన అందమైన భాగాల్ని చూసుకొని మురిసిపోతాడు మానవుడు.

"శరీరంమీద వ్యామోహం నశించితేనేగాని మరణించలేడు మానవుడు. భీష్ముని సంగతే చూడండి. ఆజన్మబ్రహ్మచారి. ఆయనకేముంది శరీరవ్యామోహం? ఏమి సౌఖ్యం అనుభవించాడు శారీరకంగా? అయినా నిలువెల్లా బాణాలు గుచ్చినప్పుడే గానీ మరణించాలని కోర్కె పుట్టలేదు ఆయనకి.

"ఆంజనేయుడి శరీరం ఉంది. అది ఒక వింత శరీరం. రబ్బరు శరీరం. వాయుపుత్రుడు అంటారు. ఎందువని? అది గాలి పూరించిన కొద్దీ పెరిగేది. తగ్గించితే తగ్గేది. అదీ రహస్యం.

"కృష్ణుణ్ణి మాయామానుష విగ్రహం అన్నారు. అది నిజమే. నిలుచున్నపాటున మాయమయ్యేది. అందులో అణచిపెట్టగలిగే అంశమేమీ లేకుండేది. అతడు ఒకరికి ఇచ్చేది గానీ, ఇతరులనుండి గ్రహించేదిగానీ ఏమీ ఉండేది కాదు. అందుకే పదహారువేలగోపికలు అతని చుట్టూ గెంతేవారు.

"మానవుడు ఎప్పుడూ ప్రకృతిని ఎదిరించడానికి చేసే ప్రయత్నాలన్నీ ఈ శరీర సంరక్షణకోసమే కదుటండీ?"

ఆయన భోజనం పూర్తి అయింది.

"చూశారా, మాటలలోపడి బాధ మరిచాను. కాబట్టే భోజనం కూడా చెయ్యగలిగాను" అని ఆనందంతో బయటకు నడిచాడు ఆయన.

మా స్నేహితులు కొందరికి చెప్పాను ఈ ఈ చర్చల సారాంశం. "ఆయన్నొకసారి చూపిస్తే బాగుండును" అన్నారు.

ఉదయమే కథ వ్రాసుకుంటున్నాను. ఆయన వచ్చాడు. "కాఫీ వేళకు వచ్చారు. తాగి వెళ్ళండి" అన్నాను. ఆయన కుర్చీపై కూచున్నాడు. నేను వ్రాస్తున్నది ఏమని ప్రశ్నించాడు. వ్రాసిన కథ చదివి వినిపించాను. "మీరు వేదాంతులవలె కనిపిస్తున్నారు. జీవితం అస్థిరమని, సౌఖ్యాలు శాశ్వతాలు కావని, చావు నిశ్చయమని తెలిసి మరీ సంసారయాతనలో పడ్డారు" అన్నా డాయన.

"మీరు ఇంతటి మేధావులు. మరి ఈ వేషం ఏమిటి మీకు?" అని అడిగాను.

"బుద్ధి, జ్ఞానం కలిగినంతమాత్రాన మానవుడు సంసారయాత్ర చెయ్యగలడు అనుకోవడం అవివేకం. దానికి డబ్బు ప్రధానం. ధనం సంపాదించలేనివాడు అందుకు అర్హుడుకాడు. నాకు ఆ విద్య చేతకాదు. ఓటు పడవని తీసుకొనిపోయి నడిసముద్రంలో వదలలేను. తగుదునమ్మా అని

భమిడిపాటి వెంకటరమణ

# దీపావళి కథల పోటీ

## 2,000 రూపాయల బహుమతులు

ప్రతి ఏడాదివలెనే విశ్వావసులో కూడా దీపావళి సందర్భంలో ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక కథల పోటీ నిర్వహిస్తున్నది.

తెలుగు రచయితలు ఈ అవకాశం వినియోగించుకొని, పాఠకులకు ఉత్తమమైన కథలు సమర్పించాలనే మా పూనిక విజయవంతంగా నెరవేరడానికి తోడ్పడాలని అర్థిస్తున్నాము.

**మొదటి బహుమతి 850 :: రెండవ బహుమతి 500**

**మూడవ బహుమతి 350**

**రెండు కన్సొలేషన్ బహుమతులు : చెరొక 150**

**దీపావళి కథల పోటీ నిబంధనలు :**

1. ఇతివృత్తం ఆంధ్రుల జీవితానికి సంబంధించినదై ఉండాలి.
2. స్వీయరచనలే కాని అనువాదాలు పంపరాదు.
3. రచన పావుతావు సైజులో 12 పేజీలకు మించరాదు.
4. సిరాతో కాగితానికి ఒకప్రక్కన వ్రాయాలి.
5. బహుమతి పొందని కథలలో యోగ్యమైనవి ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో ప్రచురించే హక్కు మాకు ఉన్నది.
6. పోటీకి రచన పంపేటప్పుడు కవరు మీద 'దీపావళి కథల పోటీకి' అని స్పష్టంగా వ్రాయాలి.
7. పోటీకి పంపిన కథలు ఏ సందర్భంలోనూ త్రిప్పిపంపబడవు.
8. రచనలు 'ఎడిటర్, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, ఎక్స్‌ప్రెస్ ఎస్టేట్స్, మద్రాసు—2'కు పంపాలి.

**బహుమతి పొందిన కథలను ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక దీపావళి ప్రత్యేక సంచికలో ప్రచురించగలము**

| | |
|---|---|
| దీపావళి కథల పోటీకి రచనలు మాకు చేరవలసిన ఆఖరి తేది | **1965 సెప్టెంబరు 30** |


# సంచార వేదాంతి

నలుగురితో పోటీ చెయ్యలేను. నన్ను నేను మోసగించుకోలేను.

"యాచించి బ్రతకడం నీచమని మీరు అభిప్రాయపడతా ఉండవచ్చు. జీవించేందుకు ప్రతివాడికీ హక్కు ఉన్నదని గ్రహించండి. నా హక్కును నేను కోరడంలో తప్పేమున్నదో చెప్పండి. దానం చెయ్యడం, దయచూపడం మానవుల విధి, ధర్మమున్నూ" అన్నాడు ఆయన.

ఆతని విషయంలో యాచన నీచమనిపించలేదు. నాతోపాటు భోజనం చెయ్యవలసిందిగా కోరాను ఆయన్ను.

"అంతేకాదు. ఊళ్ళో జరుగుతున్న నాట్య ప్రదర్శనం చూడాలని కుతూహలంగా ఉంది. అందుకు కావలసిన ధనసహాయం కూడా మీరు చెయ్యాలి" అన్నాడు ఆయన.

నాకు అభ్యంతర మేమీలేదు.

"బిచ్చగాడు, వీడికెందుకు నాట్యాలు? అని అనవచ్చు మీరు. బిచ్చగాణ్ణయినా నేనూ ఒక జీవినే. జీవించే ప్రతిప్రాణికీ ఆనందించే హక్కు ఉంది. అది మీరు కాదనగలరా?" అన్నాడు.

"అది ఎంతమాత్రమూ నా ఉద్దేశం కాదు" అన్నాను. నా మిత్రుల కోరిక తెలియపరిచాను. ఆయన ఆశ్చర్యపడలేదు. ఆయన్ను నాకూడా తీసుకొని వెళ్ళాను. నా మిత్రులకు పరిచయం చేసివచ్చాను. తిరిగి వస్తుండగా, "మీరు, నేను అనుకొన్నదానికన్న అధికులు. ఇద్దరు కృష్ణులకు సమానులు. మీకుమీరై సంతృప్తిపొందడమే కాదు. మీ ఆనందాన్ని మిత్రులకు కూడా పంచిపెట్టిపోవడం, సాధారణ విషయంకాదు. అదీగాక మీరు సంకోచమేమీ లేకుండా నన్ను వెంటబెట్టుకొని మీ మిత్రుల దగ్గరకు తీసుకొని వెళ్ళడమే మీ ఆధిక్యానికి నిదర్శనం. చాలామందికి ఈ సాహసం ఉండదు" అన్నాడు ఆయన. ఇంచుమించుగా ఆతణ్ణి ఇప్పుడిప్పుడు ప్రతిరోజూ చూడగలుగుతున్నాను.

"మీతోటి బాంధవ్యం దృఢపడుతున్నది. ఈ పట్టణంమీద వ్యామోహం పెరుగుతున్నది. ఇవి రెండూ చాలు, ఈ జీవిని కట్టి పడవేయడానికి. అప్పుడు ఈ జీవితంపై బరువు బాధ్యతలు పడతాయి. ఇంక పూర్వంవలె ఎక్కడికిపడితే అక్కడికి, ఎప్పుడుపడితే అప్పుడు స్వేచ్ఛగా ఎగిరిపోవడానికి వీలు ఉండదు" అని అన్నాడు ఆయన ఒకనాడు.

తరువాత మూడురోజులనాడు నేనూ, నా మిత్రులందరమూ కలిసి ఊరంతా గాలించాము. ఆయన ఆచూకీలేదు—అప్పటికీ ఇప్పటికీనూ. ★